


స్కూల్ టీచర్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా

వైవీయూను అత్యున్నతంగా తీర్చిదిద్దుతా

- నూతన విసి ఆచార్య చింత సుధాకర్

ప్రజాశక్తి - కడప అర్బన్



బాధ్యతలు చేపడుతున్న విసి సుధాకర్

యోగి వేమన విశ్వ విద్యాలయాన్ని అనతి కాలంలోనే దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థగా తీర్చిదిద్దుతానని యోగి వేమన విశ్వ విద్యాలయం నూతన విసి ఆచార్య చింత సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 9.5 గంటలకు తన కుటుంబ సభ్యులతో విశ్వవిద్యాలయానికి చేరుకున్న విసికి రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పూజా కార్యక్రమం అనంతరం పైళ్లపై సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ 2006లో ఏర్పాటైన యోగి వేమన విశ్వ విద్యాలయాన్ని చాలా దగ్గరగా పరిశీలించానని చెప్పారు. పలు సందర్భాల్లో ఇక్కడికి వచ్చానన్నారు. ఇదివరకు పనిచేసి ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, శ్యామ్‌సుందర్, రామచంద్రారెడ్డి, మునగాల సూర్యకళావతి పదహారేళ్లల్లో గొప్ప అభివృద్ధి చేసి చూపారన్నారు. తనకున్న బోధన, పరిశోధన, పరిపాల నాపరమైన అనుభవంతో వైవీయూను ప్రగతి పథంలో నడిపిస్తామన్నారు. న్యాక్ ఏ గ్రేడ్ ద్వారా సంస్థల నుంచి నిధులను తెచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. విశ్వవిద్యాలయంలో అభివృద్ధికి అన్ని వనరులు ఉన్నాయని , సమిష్టిగా పనిచేయడమే మిగిలి ఉందని చెప్పారు.

డిగ్రీ 1, 3 సెమిస్టర్ల ఫలితాల విడుదల

యోగి వేమన విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ చార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఫలితాల విడుదల సందర్భంగా పరీక్షల విభాగాన్ని విసి అభినందించారు. ఉత్తమ ఫలితాలను సొంతం చేసుకున్న విద్యార్థులను, కళాశాలల యాజమాన్యాలను ప్రశంసించారు. పరీక్షల నియంత్రణ అధికారి మాట్లాడుతూ ప్రథమ సెమిస్టర్ బిఎ, బిబిఎ, బికాం, బిఎస్‌సి, ఒకేషనల్ పరీక్షలకు మొత్తం 5,516 మంది విద్యార్థులు హాజరుకాగా 3,506 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మూడో సెమిస్టర్‌లో మొత్తం 9,311 మంది విద్యార్థులు హాజరుకాగా 4,577 మంది ఉత్తీర్ణులు అయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలు యోగి వేమన విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో లభిస్తాయన్నారు.

జగన్ననకు చెబుదాం.. కేవలం ప్రచారం మాత్రమే

కడప : జగనన్నకు చెబుదాంతో వరిగేది ఏమీ లేదని, ఇది కేవలం ప్రచారం మాత్రమే అని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంతో ఆర్భాటంగా మొదలుపెట్టిన జగనన్నకు చెబుదాం 1902కు కాల్ చేసి సమస్య చెప్పాలనుకుంటే మూడు నుంచి నాలుగు గంటలు పడుతుందన్నారు. కొందరైతే కాల్ చేసి విసిగి వేసారి పోయారని పేర్కొన్నారు. ఒకవేళ సమస్య తెలియజేసినా స్పందన కరువే అన్నారు. జగనన్నకు చెబుదాం కంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వారం వారం జరిగే స్పందన కార్యక్రమం మేలు అని చెప్పారు. అర్జీలకు రసీదులు కూడా ఇస్తారు అన్నారు. రెండు, మూడు రోజుల్లో ఏదో ఒక సమాచారం కూడా వస్తుంది అని తెలిపారు. జగనన్నకు చెబుదాంలో సమస్య తెలిపిన అది మరలా కలెక్టర్ కార్యాలయానికి రావాల్సిందే అన్నారు. కలెక్టర్ ద్వారా సంబంధిత డిపార్టుమెంటుకు సమాచారం పంపాల్సిందే. అంత మాత్రానికే జగనన్నకు చెబుతాం ఎందుకు? ఇది కేవలం ప్రచారమే, దీనివల్ల ప్రజలకు ఎటువంటి లాభం లేదని, ప్రజలకు పనికి వచ్చే కార్యక్రమాలు చేయాలని ముఖ్యమంత్రికి హితవు పలికారు.

పేదలపై అదనపు భారం మోపడం దారుణం

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న విష్ణుప్రీతమ్‌రెడ్డి

పేదలపై అదనపు విద్యుత్ ఛార్జీల భారం మోపడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి అన్నారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రకరకాల పేర్లతో ప్రజల నడ్డి విరుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు పెట్టే వారు అసలు ముందుకు వస్తారా అని ప్రశ్నించారు. రాజన్న రాజ్యం అంటే రోజుకో ఛార్జీలతో ప్రజలను దోచుకోవడమేనా అని విమర్శించారు. రైతులకి ఉచిత కరెంటు ఇచ్చి వారికి బారాన్ని తగ్గించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజల పట్ల చిత్త శుద్ధి ఉంటే పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టీఐ చైర్మన్ లక్షుమయ్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య, ఎన్ఎంయుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు పాల్గొన్నారు.

115 క్వింటాళ్ల జీలుగలు మంజూరు

వల్లూరు : ఖరీఫ్ పంట కాలంలో వరి సాగు చేసే రైతులందరూ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో జీలుగల కోసం బయోమెట్రిక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 115 క్వింటాళ్ల జీలగలు, పచ్చి రొట్టె ఎరువు మంజూరయ్యాయని తెలిపారు. జీలుగలు , పచ్చిరొట్టె ఎరువు కావాలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ తీసుకుని రిజిస్ట్రేషన్ చేసుకుని జీలుగలు పొందాలన్నారు. పది కిలోల జీలుగలకు ప్రభుత్వం అందించిన ధర రూ.790 పోను సబ్సిడీ ధర రైతులు 395 చెల్లించాలని చెప్పారు.

టెన్త్ టాపర్స్‌కు ప్రోత్సాహక బహుమతులు

ప్రజాశక్తి - కడప



2022-23 ఏడాదిలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి టాపర్స్‌గా నిలిచిన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తొగట వీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించి అభినందించాల్సిన మంచి ఆశయంతో నగదు బహుమతులు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. మొదటి ప్రోత్సాహక బహుమతి కింద రూ.లక్ష, రెండవ ప్రోత్సాహక బహుమతి కింద రూ.50 వేలు, మూడవ ప్రోత్సాహక బహుమతి కింద రూ.25 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. తరువాత స్థానాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.పదివేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రోత్సాహక బహుమతులకు ఎంపికైన వారికి నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేసి సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాల వారీగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 541 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, చిరునామాతో కూడిన పూర్తి వివరాలను ఆయా జిల్లాల తొగటవీర ప్రక్రియ సంక్షేమ సంఘం అధ్యక్షులకు పంపాలన్నారు. తోగట వీర క్షత్రియ కులానికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని తోగటవీర క్షత్రియ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ కోరారు.

ప్రణాళికా బద్ధంగా రీసర్వే : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను. జిల్లాలో ప్రణాళికా బద్ధంగా చేపడుతున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి రాష్ట్ర భూ పరిపాలనా శాఖ కమిషనర్ సాయిప్రసాద్ 'జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష' పథకం అమలు, రీ సర్వేలో భాగంగా స్టోన్స్ ప్లాంటేషన్, గ్రౌండ్ టూథింగ్ మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జెసి గణేష్‌కుమార్, డిఆర్ఓ గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ కమిషనర్ మాట్లాడుతూ రీసర్వే చేపట్టిన గ్రామాల్లో గ్రౌండ్ టు థింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోగా గ్రౌండ్ టుథింగ్ ప్రక్రియను పూర్తి స్థాయిలో చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరితగతిన రీ సర్వేలో అన్ని రకాల ప్రక్రియలను పూర్తిచేయాలన్నారు. రీసర్వే కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సాంకేతిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వివాదాలు లేని భూ రికార్డుల రూపకల్పన కోసమే రీసర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక పరిజ్ఞానంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు రీసర్వే, భూ రికార్డుల స్వచ్ఛీకరణ ప్రక్రియను పూర్తి చేయగలిగామని చెప్పారు. భూహక్కు పత్రాలను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి ల్యాండ్ సర్వే శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలి జిల్లాలో రీసర్వే, భూ సేకరణ పనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధన, హెల్త్ / ఐసిడిఎస్ పరిధిలో ప్రభుత్వ పథకాల అమలు, స్కూల్ ఎడ్యుకేషన్, గ్రామ/వార్డు సచివాలయాలు, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, తదితర అంశాలపై.. అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ తోపాటు జెసిగణేష్ కుమార్ సంబంధిత అధికారులు హాజరయ్యారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని ఆదేశించారు. అన్ని అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా, డిఆర్‌డిఎ ల్యాండ్ సర్వే, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, సంక్షేమ, సర్వే, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భాష ఉన్నతిని చాటిన యాస

- ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్



పుస్తకావిష్కరణలో అతిథులు

'నా సీమ యాసే నా శ్వాస' సంపుటి ద్వారా రచయిత గజేంద్రనాథ్ రెడ్డి తన ప్రాంతం యాసతో తల్లిభాష ఉన్నతిని చాటారని భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ లయన్ మానస కె. చిన్నప రెడ్డి అన్నారు. హైదరాబాదుకు చెందిన లలిత కళాభిరామ పించము సంస్థ స్థానిక రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి సౌజన్యంతో గురువారం సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఎలిచెర్ల గజేంద్రనాథ్ రెడ్డి రచించిన 'నా సీమ యాసే నా శ్వాస' కథా సంపుటి పరిచయ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఇతర ప్రతినిధులతో కలసి పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నపరెడ్డి మాట్లాడుతూ మాతృభాష అమ్మలాంటిదనీ, ఆత్మలాంటిదనీ, యాస సొగసుతో కలిసిన భాష తన సంస్కృతీ సంప్రదాయాల ఉన్నతిని పెంచి స్వచ్ఛమ్మైన భావావిష్కరణకు దోహదపడగలదన్నారు. ఈ ప్రయత్నంలో గజేంద్రనాథ్ రెడ్డి విజయం సాధించారన్నారు. అనంతరం మరాఠారత్న ఎం.కె. బి.ఎస్.ఆర్. సాగర్ పర్యవేక్షణలో కళా సాహిత్య, పర్యాటక రంగాలలో విశేష కృషిచేస్తున్న కొండూరు జనార్ధన రాజు, పవన్ కుమార్ పంతులకు లలిత కళాభిరామ పించము పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, విశిష్ట అతిథి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ డాక్టర్ ఎలిచెర్ల శివానందలహరి రెడ్డి సాఫ్ట్ వేర్ ఇంజనీర్ వివేక్ లంకమల, వైవీయూ పెయింటింగ్ విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు, రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య పాల్గొన్నారు. ఫోటో : పుస్తకావిష్కరణలో అతిథులు



కుక్కలు బాభోయ్..

- గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- భయాందోళనలో ప్రజలు
- ద్విచక్ర వాహనదారుల్లోనూ భయం
- ఏప్రిల్ నెలలోనే 431 మందికి కుక్కకాటు
- నియంత్రణ చర్యల్లో యంత్రాంగం విఫలం

ప్రజాశక్తి-రాయచోటి



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

జిల్లాలో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కుక్కలు ఎవరిని పడితే వారిని చిన్న, పెద్ద ,ముసలి, ముతక అని తేడా లేకుండా దాడి చేసి గాయపరచడంతో ఆసుపత్రికి పరుగులు తీయాల్సిన పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. ముఖ్యంగా వీధులల్లో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఉంటారు. అలాంటి వారిపై కుక్కలు ఒకసారిగా దాడి చేసి ముఖం, కాళ్లు, చేతులు, పొట్ట భాగాలపై కరవడం ఘాట్లు పడేలా రాక్కడం రక్తస్రావ గాయాలు పాలు అవుతున్నారు.దీంతో పిల్లలు ఏడుస్తూ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కుక్కలను వెంటపడి కొట్టే పరిస్థితి వచ్చినప్పటికీ అవి దొరక్కుండా పరుగులు తీస్తూ ఉన్నాయి. పిల్లలు తల్లిదండ్రులు హుటా హుటిన బిడ్డలను తీసుకొని ఆస్పత్రికి వెళ్లి కుక్క కాటుకు టీకాలు, గాయాలకు మందులు వేయించుకుని తీసుకొచ్చి బిడ్డలను జాగ్రత్తగా మరో మారు కుక్కల దాడి పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే పలు వీధుల్లో కుక్కలు గుంపులుగా వాహనాలపై వెళ్లే వారిపై అరుస్తూ, దాడులు చేస్తూ పరుగులు తీస్తున్నాయి. ఈ తొందరలో వాహన దారులు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న పలు వాహనాలను ఢీకొనడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలు ఎక్కడపడితే అక్కడ వీధుల్లో భారీ సంఖ్యలో గుంపులుగా చేరి వచ్చిపోయే వారిపై అరుస్తూ కరవడం చేస్తు న్నాయి. ఇటీవల కాలంలో రాజంపేట నియోజ కవర్గం చిన్న పిల్లల పైన అనేకసార్లు దాడులు చేశాయి.

431 మందికి గాయాలు

జిల్లాలో ఏప్రిల్ ఒక్క నెలలోనే 431 మంది కుక్కకాటుకు గురయ్యారు. అందులో 160 మంది పురుషులు కాగా 271 మంది మహిళలు గాయపడిన వారిలో ఉన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కుక్క కాటుకు మందులున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రజలు ఆందోళనలో దగ్గరలో ఉన్న ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు. ఇక చీకటి పడితే పట్టణాలలో సందుల్లో వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు ఎక్కడ కుక్కలు ఉన్నాయో లేదో చూసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధిలైట్లు లేని ప్రాంతాల్లో కుక్కలు వస్తున్న వారిపై దాడి చేసి గాయాలు పాలు చేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ జిల్లాలో కుక్కలను అదుపు చేయడంలో సంబంధంత అధికారులు శ్రద్ధ చూపకపోవడం పట్ల పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కుక్కలు లేకుండా వాటిని పట్టుకు వెళ్లి ద్వారా ప్రాంతాలకు తరలించి వదిలివేయాలని లేకుంటే ప్రాణాలు చేతుల్లో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ పిల్లలు చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రుల్లో వెళ్లాలంటే భయమేస్తోంది

పట్టణంలో రాత్రి వేలల్లో నడు చుకుంటూ వెళ్లాలంటే కుక్కలతో భయమేస్తోంది. పట్టణంలో ద్విచక్ర వాహ నంలో గాని, నడు చుకుంటూ గాని ఒంట రిగా వెళ్లాలంటే కుక్కలు వెంటాడుతున్నాయి. మున్సిపల్ అధికారులు కొన్ని వీధులు మాత్రమే కుక్కలను పడుతున్నారు. పట్టణంలో అన్ని వీధిలో తిరిగి కుక్కలకు టీకాలు వేసి, కుక్కల బెడద లేకుండా చూడాలి.

- కె.వెంకటరమణ, కె.రామాపురం, రాయచోటి.

జిల్లాలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వీధుల్లో గుంపులుగా ఉంటున్న కుక్కలను చూసి జనం భయపడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఏదోఒక చోట రోజూ ఎవరో ఒకరు కుక్క కాటు బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం నిర్మాణాత్మక చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది.

టీకాలు అందుబాటులో ఉన్నాయి

జిల్లా వ్యాప్తంగా 58 సిహెచ్‌సి సెంటర్లు ఉన్నాయి. రూరల్ 47, అర్బన్ 11 సెంటర్లు ఉన్నాయి. ప్రతి సిహెచ్‌సి సెంటర్లో ఎఆర్‌వి టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్క కాటుకు వలన గాయాలైతే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో వెళ్లి వైద్యులు సూచనల మేరకు టీకాలు వేయించుకోవాలి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఎన్.కొండయ్య, డిఎంహెచ్ఒ, రాయచోటి.

నేడు సిపిఎస్ రద్దు కోరుతూ నిరాహారదీక్ష

- ఎస్‌టిఎఫ్ఐ జనరల్ కౌన్సిల్ పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎస్ రద్దుచేయాలని, ఎన్ఇపి 2020 విధానాన్ని ఉపసంహరణ చేయాలని, చరిత్ర పాఠాలు తొలిగించి, చరిత్రను వక్రీకరించే పాఠాలను ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ శుక్రవారం 24 గంటల నిరాహారదీక్ష చేయాలని కేరళ తిరువనంతపురంలో నిర్వహిస్తున్న స్కూల్ టీచర్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ పిలుపు నిచ్చిందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీ రాజా తెలిపారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు హరికృష్ణన్ అధ్యక్షతన ఈనెల 10,11 తేదీలలో కేరళ రాష్ట్రం తిరువనంతపురంలోని కేరళ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారని తెలిపారు. 2004 నుంచి అమలు అవుతున్న సిపిఎస్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలు పాతపెన్షన్‌లోకి మారినా ఇంకా కొన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం సిపిఎస్‌ని రద్దు చేయక పోగా, ఉద్యోగ ఉపాధ్యాయుల నుంచి సేకరణ చేసిన ఎన్ఎస్‌డి ఎల్ వద్ద ఉన్న సొమ్ము తిరిగి ఇవ్వమని బెదిరించడం సరికాదని విమర్శించారు. విద్యలో మత తత్వీకరణకు పునాది వేసే జాతీయ విద్యావిధానం 2020ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలు అయిన లౌకికవాదం, ప్రజాస్వామ్యం సూత్రాలకు భిన్నంగా అంధవిశ్వాసాలను పొంపొందించడానికి అనుగుణంగా జాతీయ విద్యావిధానం ఉందని విమర్శించారు. సెప్టెంబర్, అక్టోబర్‌లలో కలిసివచ్చే విద్యార్థి, యువజన, ఉద్యోగ,ఉపాధ్యాయ, మహిళ,కార్మిక సంఘాలను కలుపుకుని సిపిఎస్, ఎన్ఇపి 2020 రద్దు, చరిత్ర పాఠాలు తొలిగింపునకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు చేయడానికి సన్నాహాలు చేసుకుని, 2023, నవంబర్ 3న చలో పార్లమెంటు నిర్వహించాలని కోరారు. కేంద్రంలో రెజ్లింగ్ క్రీడాకారులు చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తూ తీర్మానం చేశామని తెలిపారు.

ప్రేరణతో 'పది'లో ఉత్తమ ఫలితాలు : కమిషనర్

ప్రజాశక్తి- కడప అర్బన్

2022-23 విద్యా సంవత్సరానికి పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ విద్యార్థులను నగరపాలక కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ అభినందించారు. గురువారం నగరంలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో కడప మండల విద్యాశాఖాధికారి పాలెం నారాయణ, హెచ్ఎం నాగమణి మర్యాదపూర్వంగా కలిసి విద్యార్థుల ప్రతిభను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం చివరిలో విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి నిపుణులైన సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లతో తయారు చేసిన ప్రేరణ పుస్తకం ను చక్కగా సద్వినియోగం చేసుకుని ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత కావడం అభినందనీయం అన్నారు. నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ విద్యార్థులు ఉజ్వల 578, ధనుష్ 575 తో పాటు 500 పైగా మార్కులు 20 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు.

ఫిజియోథెరపీ తప్పనిసరి

ప్రజాశక్తి - వల్లూరు



ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యులు

కుష్టు వ్యాధితో అంగ వైకల్యం కలిగిన వారు తప్పనిసరిగా ఫిజియోథెరపీ చేయించుకోవాలని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ భరత్, ఫిజి యోథెరపీ డాక్టర్ విక్టర్ మనోహర్ తెలిపారు. గురువారం మండల కేంద్రం లోని ఆరోగ్య కేంద్రాన్ని కడప జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఖాదరవల్లి ఆదేశాల మేరకు వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో కుష్టి వ్యాధితో అంగవైకల్యం కలిగిన వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగవైకల్యం కలిగిన వారు రోజు కాళ్లు చేతులు నీళ్లతో నానబెట్టి వాటిని శుభ్రపరుచుకోవాలని అనంత రం మర్దన చేసుకోవాలని సూచించారు. గాయాలు ఉన్నవారు వాటిని శుభ్రపరిచి పూతమందు వాడాలని సూచించారు. టిబి, క్షయ కార్యక్రమం పై సర్వే నిర్వహించాలని తెలిపారు. రోజూ ఆశా కార్యకర్తలు 10 ఇళ్లను సర్వే నిర్వహించి కుష్టు, క్షయ వ్యాధిపై సర్వే నిర్వహించి నివేదికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో పిఎంఒ నాగన్న, డిపిఎంఒ వీరభద్రయ్య, సిహెచ్ఒ వేణుగోపాల్ , పిహెచ్ఎన్ నిర్మల, సూపర్‌వైజర్ మమత, స్టాఫ్ నర్స్, ఉమా, ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నికల్ సిబ్బంది మహేంద్ర పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం

కడప : నగరంలోని పక్కిరపల్లెలో శశి, విశ్వనాథ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పివిఆర్ బ్యాడ్మింటన్ ఎరినా ఇండోర్ స్టేడియాన్ని గురువారం వైసిపి జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ కె.సురేష్ బాబు ప్రారంభించారు. క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేసి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎపి ఆర్‌టిసి చైర్మన్ దుర్గాయపల్లి మల్లికార్జునరెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, వైసిపి కార్పొరేటర్లు, నాయకులు మల్లికార్జున, రామ లక్ష్మణ రెడ్డి, శివ కోటి రెడ్డి, షఫీ అడ్వకేట్స్ శివశంకర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సుదర్శన రెడ్డి,రాఘవ రెడ్డి , నాయకులు మధు రెడ్డి, జగదీశ్వర రెడ్డి,అనిల్ , దేవా, రమణ ,ఓబుల్ రెడ్డి, స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి బాషా మోహిద్దున్, జిలానీ బాషా పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి : డిఎల్‌పిఒ


ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని డిఎల్‌పిఒ రమణారెడ్డి పేర్కొన్నారు. గురవారం ఆయన పట్టణంలోని 1,3 సచివాలయాలను సందర్శించారు. సిబ్బంది బయోమెట్రిక్, అటెండెన్స్ రిజిస్టర్, వారి పనితీరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. డ్రెస్ కోడ్ పాటించని వారిని మందలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, సచివాలయ సిబ్బంది అందరూ స్పందనకు హాజరుకావాలన్నారు. ప్రజలందరూ ఇక్కడే అర్జీలు ఇవ్వాలని, వారి అర్జీలకు పరిష్కారం వెంటనే ఇక్కడే చూపాలన్నారు గ్రీవెన్స్‌కు హాజరు కానీ ఉద్యోగుల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. డివిజన్ లోని తొమ్మిది మండలాలలో సందర్శిస్తానని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిమీద ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేజర్ పంచాయితీ సర్పంచ్ యనమల సుధాకర్, పంచాయతీ ఎఒ సుబ్బారెడ్డి, 1,3 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

ప్రజాశక్తి - కడప

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకుంటామని విద్యుత్ ఎస్ఇ ఎస్. రమణ తెలిపారు. గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ యువర్ విద్యుత్ ఎస్ఇ కార్యక్రమం ద్వారా కడప, ఖాజీపేట, ముద్దనూరు, పోరుమామిళ్ల, చింతకొమ్మదిన్నె, నందలూరు, పెండ్లిమర్రి తదితర ప్రాంతాల నుంచి విద్యుత్ వినియోగదారులు వివిధ రకాల సమస్యలు తమ దృష్టికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి, విద్యుత్ లైన్లు, కరెంటు స్తంభాలు, డిటిఆర్‌కు సంబంధించి, విద్యుత్ సరఫరాలో అంతరాయులకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ పరిశీలించిన అనంతరం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజిఇనీర్ టెక్నికల్ ఎన్. చక్రవర్తి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. సుబ్రహ్మణ్యం, జీ.వి. సుబ్బారావు, ఏఈ నీరజ, లావణ్య పాల్గొన్నారు.



ప్రజాసమస్యలు వింటున్న ఎస్ఇ రమణ


స్థల పరిశీలనలో ఎమ్మెల్యే రాచమల్లు, పార్టీ నాయకులు

రాజన్న ఉచిత భోజన స్థల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాజన్న ఉచిత భోజన స్థల, వంటశాల ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ప్రొద్దుటూరు పేద ప్రజలకు త్వరలో రాజన్న ఉచిత భోజనం ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మున్సిపల్ పెట్రోల్ బంకు పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడున్న చిరు వ్యాపారులతో మాట్లాడారు. ఈ స్థలం మున్సిపాలిటీకి చెందినదని, అవసరమైనప్పుడు దీన్ని ఖాళీ చేయాల్సి వస్తుందని చెప్పామన్నారు. ఎప్పుడు ఖాళీ చేయాలనేది మున్సిపల్ కమిషనర్ చెబుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ స్థలంలో రాజన్న ఉచిత భోజనంతోపాటు మొబైల్ భోజనం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి, 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాలశౌరి, వైసిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి కల్లూరు నాగేంద్ర,రాజుపాలెం మడల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు లక్కిరెడ్డి పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

14న హనుమజ్జయంతి


దువ్వూరు : ఈ నెల 14న హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాహకులు చిన్న వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ఆకుపూజ, హోహం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

రక్తదాతకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు


రక్తదానం చేస్తున్న భానుచందర్

ఆపదలో ఉన్న మహిళకు ఏ పాజిటివ్ రక్తాన్ని అందించినట్లు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్‌రావు తెలిపారు. స్థానిక క్యాంబెల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బి.నాగమ్మభాయ్ అనే మహిళకు ఏ పాజిటివ్ రక్తం అవసరంకాగా.. బాధితులు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావును సంప్రదించారు. ఆయన వెంటనే ఫౌండేషన్ సభ్యుడు భానుచందర్ ద్వారా రక్తదానం చేయించారు. రక్తదాత భానుచందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోరే లక్ష్మణ్‌రావు, గురు రాజశేఖర్ పాల్గొన్నారు.


రోడ్డును ఆక్రమిస్తున్న కంపచెట్లు

దారిని అల్లుకుంటున్న కంపచెట్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో కంప చెట్లు ఏపుగా పెరిగి రోడ్డును అల్లుకుంటుంన్నాయి. దీంతో రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి మూసుకుపోతోంది. ఇది ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. ముఖ్యంగా రాత్రివేళ రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పులివెందుల, జమ్మలమడుగు, ముద్దనూరు ప్రాంతాల ప్రజలు ముద్దనూరు మీదుగా నిత్యం రైల్లో ప్రయాణిస్తుంటారు. చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్, హుబ్లీ, షిరిడి వంటి సుదూర ప్రాంతాలకు రైల్లో ప్రయాణం సాగిస్తుంటారు. దారిలో కంపచెట్లు పెరిగి రోడ్డుపైకి రావడంతో రాత్రి వేళల్లో అవి కనపడక వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పరిశుభ్రత లోపించడంతో దుర్వాసన వెదజల్లుతోంది. విషపురుగులు కూడా సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైల్వే ప్రయాణికులు కోరుతున్నారు.

నిర్బంధించడం అప్రజాస్వామికం

జమ్మలమడుగు రూరల్ : ఈనెల 12న టిడిపి చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు నిర్బంధించడం అప్రజాస్వామ్యమని టిడిపి తెలుగు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున తెలిపారు. గురువారం పోలీసులు ఆయన ఇంటి వద్దకు వచ్చి విజయవాడకు వెళ్లకుండా నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికా ర్జున మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు నష్ట పోయి ఇబ్బందులు పడు తుంటే వైసిపి ప్రభుత్వం వారికి అండగా నిలవకపోగా, నిలిచే వారిని ఎక్కడి కక్కడ అరెస్టు చేయడం దారుణమన్నారు. నోటీసులతో బెదిరించడం సిగ్గు చేటన్నారు. ఏ మాత్రం ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నా వెంటనే నష్టపోయిన రైతు లందరికీ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. అలాగే మిర్చి రైతులు ఆరు గాలం కష్టపడి గోడౌన్లకు చేర్చిన తర్వాత వర్షానికి తడిసిపోతే వాటికి ధర తగ్గిం చడం సబబు కాదన్నారు. ప్రస్తుతం ఉన్న రేటుకే మిరపను కొనుగోలు చేయాలన్నారు.


లంబాడి నృత్య బృందంలో భూపేష్‌రెడ్డి

మన సంప్రదాయాలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అనాదిగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని టిడిపి జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె గ్రామంలో గురువారం సేవాలాల్ నాయక్ మహారాజ్ మారెమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన హాజరై ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లంబాడి వారి ఆటపాటలలో పాల్గొన్నారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా కోలాటం ప్రదర్శించిన సున్నపురాళ్లపల్లి గ్రామ ప్రజలకు, గురువుకు, కోలాట బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పాదయాత్రలో టిడిపి జిల్లా నాయకులు


పాదయాత్రలో టిడిపి నాయకులు

కడప అర్బన్ : నందికొట్కూరు నియోజవర్గం జుపాడు బంగ్లా గ్రామంలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌తో పాటు టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి, ప్రొద్దుటూరు నియోజకర్గ ఇన్‌ఛార్జి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో యుగళం పాద యాత్రపై శ్రీనివాస రెడ్డి, రాంగోపాల్ రెడ్డి తో నారా లోకేష్ త్వరలో జిల్లాలో ప్రారంభం కాబోతున్న పాదయాత్ర రూట్ మ్యాప్‌పై చర్చించారు.

సిమెంట్ రోడ్డు.. నాణ్యతేదీ..?


మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అధ్వానంగా ఉన్న సిమెంట్ రోడ్డు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఉన్న సిమెంటు రోడ్డు నాణ్యత లేకపోవడంతో ముక్కలుగా చీలిపోయింది. అధికారులతో కుమ్మక్కై, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా ఆ రోడ్డు నిర్మాణ పనులు చేశారు. రోడ్డు వేసిన కొన్ని రోజులకే ముక్కలుగా చీలిపోయింది. రోడ్డు వేసే సమయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదారులు నాణ్యత లేకుండా రోడ్డును వేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగానే ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. ఈ రోడ్డు నుండి శేషారెడ్డిపల్లె, రోటరీ నగర్, రైల్వే స్టేషన్‌కు ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు నుండి ద్విచక్ర వాహనదారులు స్కూటర్ నడపాలంటే చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సమయాల్లో ద్విచక్ర వాహనం జారిపడి ప్రమాదాలకు గురైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఆ ప్రాంతంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. విష సర్పాలు సైతం ముక్కలైన సిమెంటు రోడ్డులో ఉంటున్నాయని పలువురు చెబుతున్నారు. ఉదయం, సాయంకాలం వేళల్లో పాదచారులు వాకింగ్‌కు ఈ రోడ్డు నుండి వెళ్తారు. పాదచారులు కూడా ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల ఒక వ్యక్తి ప్రమాదానికి గురై కాలు విరిగింది. మరో ఘటనలో యువకునికి గాయాలై లివర్ దెబ్బతిందని వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని, నాణ్యతతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రివేళ వాహనదారులకు ఇబ్బందులు



మున్సిపాలిటీ ఎదురుగా ఉన్న రోడ్డులో రాత్రి సమయాల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. చీకటిగా ఉండడంతో వాహనదారులకు అర్థం కావడం లేదు. నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు సైతం ఈ రోడ్డులో వెళుతూ ఉంటాయి.

- మహబూబ్ బాషా, జమ్మలమడుగు

నాణ్యమైన రోడ్డును నిర్మించాలి



అధికారుల పర్యవేక్షణలో నాణ్యమైన సిమెంట్ రోడ్డును నిర్మించాలి. ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

- విజయ్, సిఐటియు, జమ్మలమడుగు

ఉపాధి పనులు ముమ్మరం

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో ఉపాధి హామీకి సంబంధించి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతిరోజూ 3300 మందికిపైగా కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ముఖ్యంగా కెసి కెనాల్, వంకలో పూడికతీత, పంట కాలువలు, చెరువులలో పూడికతీత పనులు చేపడుతున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఎండలు అధికంగా ఉన్నప్పటికీ ఈ ఏడాది ప్రభుత్వం గతంలోలాలా మే నెలలో అదనంగా మంజూరు చేసే వేసవి అలవెన్సులు రూ.30 చెల్లించడం లేదు. రూ.150 నుంచి రూ.240 వరకు కూలి పడుతోందని కూలీలు చెబుతున్నారు. విశ్వనాథపురం వద్ద కెసి కెనాల్ కాలువపై కంపచెట్ల తొలగింపు పనులు చేపడుతున్నారు. పల్లవోలు, నాగులపల్లె, ఖాదర్‌పల్లె గ్రామాల వద్ద చెరువులో, వంకలలో పనులు చేస్తున్నారు. సిద్దారెడ్డిపల్లె వద్ద వంకలో కంప చెట్ల తొలగింపు, పూడికతీత పనులు చేపడుతున్నారు. వెదురూరు వద్ద పంట పొలాలు, కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. జాబ్ కార్డ్ కూలీలకు పనులు చూపుతున్నామని ఎపిఒ పద్మారాణి తెలిపారు. ఎంపిడిఒ, ఎపిఎం ఇసి, టెక్నికల్ అసిస్టెంట్లు పనులను తనిఖీ చేస్తున్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఇసి ప్రియాంక

ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఖరీఫ్ సాగుపై రైతులకు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు ఆదేశించారు. వేంపల్లెలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం వ్యవసాయ సిబ్బందితో ఆయన విధులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో పని చేస్తున్న సిబ్బంది రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించాలన్నారు. దీంతోపాటు రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. రైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న ఎరువులు, విత్తనాలను రైతులకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఖరీఫ్‌లో పంటలను సాగు చేస్తున్న రైతులకు ఎరువులు, విత్తనాలు అందించేందుకు ఆర్‌బికె సిబ్బంది సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఇకెవైసి చేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల పని తీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎఒ రాజేంద్రప్రసాద్, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఆర్‌బికె సిబ్బంది

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మశక్తిని వెలికి తీసేందుకు గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత తెలుగు పండితులు విజయభాస్కర్‌రావు కోరారు. ఈ శిబిరాల్లో భాగంగా గురువారం విద్య విలువలు నేర్పించిన మహనీయుల గూర్చి అవగాహన కల్పించారు. రకరకాల ఆటపాటలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్‌రావు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు చెడుమార్గాలు అలవర్చుకోకుండా తల్లిదండ్రులు ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇలాంటి వేసవి శిబిరాలకు తమ పిల్లలను పంపి మంచి విద్యా బుద్ధులు చెప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేటి శిబిరంలో కవి రచయిత డికె చదువులబాబు, యోగ టీచర్ వెంకటసుబ్బమ్మ, శ్రావణి, గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, రెహమాన్ ఖాన్, శారద విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయ అధికారి కృష్ణకిషోర్‌రెడ్డి తెలిపారు. గురువారం గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పడం, పద్యాలు, పుస్తక పఠనం, చిత్రలేఖనం తరగతులు నిర్వహించారు. పుస్తకాలు చదవడం వల్ల తెలివితేటలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రొద్దుటూరులో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

ఎర్రగుంట్ల : గ్రంథాలయాలు విజ్ఞాన ఖని అని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఉమాదేవి పేర్కొన్నారు. ఈనెల ఎనిమిది నుంచి ప్రారంభమైన సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం పిల్లలకు పురాణాలు, వాటి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠకుడు జయరాములు, పిల్లలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి దృష్టికి తెచ్చారు. ఎంపిపి వీరనారాయణరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నీటి సమస్యలు, భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని సర్పంచులు, ఎంపిటిసిలు తెలిపారు. వ్యవసాయ కార్యాలయం తలుపులు ఎప్పుడూ మూసే ఉంటాయన్నారు. కార్యాలయంలో ఎవరో ఒకరు ఉండేలా చూడాలని ఎంపిపి తెలిపారు. విద్యావ్యవస్థ చాలా దారుణంగా ఉందన్నారు. ఎంఇఒ పుల్లయ్యను బదిలీ చేయాలని సభ్యులు తీర్మానించారు. సమావేశానికి ఎక్సైజ్ శాఖ, రవాణాశాఖ అధికారులు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిటిసి రామగోవిందరెడ్డి, తహశీల్దార్ ఈశ్వరయ్య, స్పెషల్ ఆఫీసర్ సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎంపిడిఒ వెంగమునిరెడ్డి, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వీరనారాయణరెడ్డి

శ్రీనివాస్‌నగర్ కాలనీ రోడ్డు అధ్వానం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక మైదుకూరు రోడ్డులోని తహశీల్దార్ కార్యాలయం ఎదురువీధి శ్రీనివాస్‌నగర్ కాలనీ వాసులకు కష్టాలు తప్పడం లేదు. ఈ కాలనీకి కనీస సదుపాయాలు సమకూరలేదు. దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కాలనీ ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా సిమెంట్ దారి ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని అంటున్నారు. వర్షాకాలం సమీపిస్తోందని, ఆ సమయంలో సమీప పొలాల్లోని పంట నీరు రోడ్డు పైకొచ్చి చేరుతుంటుందని తెలిపారు. వర్షాకాలంలో కాలనీవాసులకు రాకపోకల ఇబ్బందులు చెప్పనలవికావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలుమార్లు సిమెంట్ దారి ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా చర్యలు కరువయ్యాయని ఆరోపిస్తున్నారు. కాలనీ నిర్మాణ కోసం అనుమతులు పొందినా కనీస సదుపాయాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సిసి రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.


సిమెంట్ దారికి నోచుకోని శ్రీనివాస్‌నగర్ కాలనీ

రేఖారాణికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - చాపాడు



స్థానిక సిబిఐటి కళాశాలలో బేసిక్ సైన్సు అండ్ హ్యుమానిటిస్ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఆర్.రేఖారాణికి జెఎన్‌టియుఎ (అనంతపురం) యూనివర్సిటీ 'ఇంగ్లీష్ లిటరేచర్' విభాగంలో డాక్టరేట్ పట్టా ప్రదానం చేసింది. ప్రొఫెసర్ వి.బి. చిత్ర పర్యవేక్షణలో 'కమల మార్కండేయ నావెల్స్ ఎ రెప్లికా ఆఫ్ ఇండియన్ సొసైటీ' అనే అంశంపై చేసిన పరిశోధనకుగానూఈ డాక్టరేట్ లభించింది. తమ కళాశాల అధ్యాపకురాలికి గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.


ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్ మనోహర్‌రెడ్డి

అనధికార కట్టడాలపై చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా నిర్మించిన కట్టడాలను కూల్చేస్తామని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్ రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. ఆ మేరకు గురువారం మునిసిపల్ కమిషనర్ వివి నరసింహారెడ్డితో కలిసి వారు వాసవి కాలనీ, చిన్న కొండారెడ్డి కాలనీలో పర్యటించారు. అక్కడ ప్రజలకు కేటాయించిన స్థలంలో కాకుండా వారి ఇష్టానుసారం ఇళ్లు ముందుకు సాగి నిర్మాణాలు చేపట్టడం, కాలువలపై నిర్మాణాలు చేపట్టడం సరికాదన్నారు. అలాంటి నిర్మాణాలను కచ్చితంగా కూల్చేస్తామన్నారు. పట్టణంలో చాలా చోట్ల ఇళ్ల ముందుకు సాగి కడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడ్డుపడుతున్న 'వరద'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి

ఎనభై రెండేళ్ల వయసులో పెద్దాయనకు ఛాదస్తం పెరిగి అభివృద్ధికి అడ్డుపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఎన్.వరద రాజుల రెడ్డిని ఉద్దేశించి మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి అన్నా రు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణ విషయంలో ఇంజనీర్లు, డిజైనింగ్ ఇంజనీర్లు, మున్సిపల్ అధికారులు తీసుకున్న నిర్ణయం మేరకు పనులు జరుగుతున్నాయన్నారు. పెద్దాయన తన స్వగ్రామమైన కామనూరులో నిర్మించిన ఇంటికైతే ఉన్నత చదువుల ఇంజీర్లు అవసరం.. ప్రజలకు ఉపయోగపడే కూరగాయల మార్కెట్‌కేమో స్థానిక సరిపోతారా అని ప్రశ్నించారు. ఆయన మాటలు అభివృద్ధికి అడ్డుపడేవే అన్నారు. మున్సిపాలిటీకి రూ.30వేలు ఆదా చేశామన్నారు. ఈ నాలుగేళ్ల కాలం వరదరాజులరెడ్డి రాజకీయాలకు దూరంగా ఉండి, ఇప్పుడు చంద్రబాబు మెప్పు పొందేందుకు అభివృద్ధిని అడ్డుకునేలా వరదరాజులరెడ్డి మాట్లాడుతున్నారని బంగారు మునిరెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.


విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో ఆర్‌టిడి విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ తరునేందు శేఖర్ పేర్కొన్నారు. వైవియు నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడవ సెమిస్టర్ ఫలితాల్లో చక్కటి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ స్థాయిలో మంచి ర్యాంకులు సాధించారన్నన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ టి.చంద్ర శేఖర్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

యువత ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - నందలూరు

నేటి యువత ప్రశ్నించే గుణాన్ని అలవరచుకొని, సమాజ అభివృద్ధికి పాటుపడాలని యువ నాయకులు మేడ విజయ శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, అరవ పల్లె లోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ ఏడవ సీజన్ ఓపెన్ టు ఆల్, హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జయాపజయాలను సమానంగా తీసుకోవాలని అన్నారు. ఐక్యతతో ఏదైనా సాధించవచ్చు అని, సమిష్టి కృషితో విజయం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ మైనార్టీ కమిషన్ సలహాదారు షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచ్ ఇబ్బు, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు వేపగుంట శ్యామరాజ్, పోతురాజు మస్తానయ్య, అరిగే మని, లోకో పైలట్ పిఇకె మూర్తి, పాస్టర్ నామాల రవీంద్ర, క్రీడాభిమాని బూదెల ప్రభాకర్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ పల్లె గ్రీస్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

మరియమ్మ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు మరియమ్మ మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, నగర కార్యదర్శి రామ మోహన్ సంతాపం తెలియజేశారు. అనారోగ్యంతో రిమ్ లో చికిత్స పొందుతున్న మరియమ్మ పరిస్థితి మరింత క్షీణించడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె మృతి సిపిఎం నగర కమిటీకి తీరనిలోటని పేర్కొన్నారు.

ప్రీమియర్ లీగ్ విజేతకు బహుమతులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో సిఎస్ఐ క్రీడా ప్రాంగణంలో గత నెల 27న నిర్వహించిన కందుల నాని ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు గురువారం బహుమతులు ప్రదానం నిర్వహించారు. ఈ లీగ్ పోటీలు రాజేష్ -11 జట్టు, కొండా -11 జట్ల మధ్య హోరాహోరీగా సాగాయి. పోటీల్లో కొండా -11 జట్టు విజయం సాధించారు. విజేతగా నిలిచిన జట్టుకు లక్ష రూపాయలు, ట్రోఫీని అందజేయడమేగాక రన్నర్స్ గా నిలిచిన (రోహిత్ -11) జట్టుకు రూ.50 వేలు, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో కందుల గ్రూప్ ఎండి డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ శ్రీ పి. ప్రేమ్ కుమార్, ఆర్గనైజర్స్ గిఫ్టీ పాల్ మరియు రెన్ని పాల్గొన్నారు.


విజేతలతో కందుల నాని